క్లుప్తంగా

## నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

ధన్వాడ: మండల కేంద్రంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పర్ణికా రెడ్డి చేతులమీదుగా పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ సింధూజ తెలిపారు. మండలంలోని కల్యాణలక్ష్మి చెక్కులు వచ్చిన వారు కార్యాలయానికి వచ్చి వివరాలు తెలుసుకుని చెక్కులను తీసుకెళ్లాలని తెలిపారు.

## ఓపెన్ ఇంటర్‌కు దరఖాస్తు చేసుకోండి

మరికల్: ఈ నెల 11లోపు ఓపెన్ పదోతరగతి, ఇంటర్‌కు దరఖాస్తు చేసుకోవాలని ఓపెన్ స్కూల్ కో–ఆర్డినేటర్ చెన్నారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని ఆర్థిక ఇబ్బందులతో చదువుకోని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ నెల 11 వరకు చివరి అవకాశమన్నారు.

## వికసిత్ భారత్ యాత్ర పోస్టర్ల విడుదల



మరికల్: మండలంలోని ఎలిగండ్లలో మంగళవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ ఓబీసీ మోర్చా వడ్డే శ్రీరామ్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పేదలకోసం అమలు చేసే ప్రజా సంక్షేమ పథకాలను గ్రామస్తులకు వివరించామన్నారు. అనంతరం కేంద్ర పథకాలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దేవమ్మ, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## కోళ్లపందెం స్థావరంపై దాడులు



మరికల్: మండలంలోని చిత్తనూర్ శివారు ప్రాంతంలో కోళ్లపందె ఆడుతున్న స్థావరంపై మంగళవారం పోలీసుల దాడులు నిర్వహించి ఆరుగురిని పట్టుకున్నారు. గ్రామస్తులు తెలిపిన వివరాలిలా.. కోళ్ల పందెం స్థావరంపై ఏకకాలంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించగా ఆరు కోడిపుంజులు, ఏడు సెల్‌ఫోన్లు, రెండు బైకులు, రూ. 4700 నగదును స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో చిత్తనూర్‌కు చెందిన భీమ్, బాలకృష్ణ, కిష్టాపూర్‌కు చెందిన శివరాజ్, మరికల్‌కు చెందిన కొండయ్య, రాంపూర్‌కు చెందిన పాషా, దేవరకద్రకు చెందిన షరీఫ్‌లపై కేసునమోదు చేసినట్లు ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు.

## 12నుంచి క్షీరలింగేశ్వర స్వామి ఉత్సవాలు



కృష్ణా: మండల కేంద్రంలోని క్షీరలింగేశ్వరస్వామివారి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నెల 12న స్వామివారికి అభిషేకం, మహాపూజ, సాయంత్రం హిందుపూర్ మంగళ వాయిద్యాలతో పల్లకీలో స్వామివారి ఊరేగింపు, 31న స్వామివారి పల్లకీ సేవ, సాయంత్రం ప్రభోత్సవం, 14న స్వామివారికి మహాపూజ, మధ్యాహ్నం సాంస్కృతిక కార్యక్రమాలు, సాయంత్రం 5గంటలకు స్వామివారి రథోత్సవం, 15న సందెపురాళ్లపోటీలు, తమ ఇళ్లవద్ద తయారు చేసిన పిండివంటలతో భక్తులు స్వామివారికి నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## గర్భిణికి రక్తదానం చేసిన న్యాయవాది

నారాయణపేట రూరల్: అత్యవసర పరిస్థితులో రక్తహీనతతో అవస్థపడుతున్న ఓ గర్భిణికి ఓ న్యాయవాది రక్తదానం చేశారు. మక్తల్ మండలం చందాపూర్‌కు చెందిన శంకరమ్మ డెలవరీకోసం జిల్లా ఆస్పత్రికి వచ్చింది. సోమవారం రాత్రి ఓ నెగిటివ్ రక్తం అవసరం ఉండగా వాట్సాప్ గ్రూపుల్లో పోస్టులు చేశారు. విషయం తెలుసుకున్న మాజీ మున్సిపల్‌వైస్ చైర్మన్, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది నందునామాజీ ఆస్పత్రికి వెళ్లి రక్తం అందించారు.

# వెలుగులు నింపని సోలార్



ఎలిగండ్లలో వెలగని సోలార్ లైట్లు

- 37 గ్రామాల్లో 554 లైట్లు
- నిరుపయోగంగా మారిన సోలార్ లైట్లు
- వృథాగా రూ. 83లక్షల నిధులు
- ఏడేళ్ల నుంచి మరమ్మతులకు నోచుకోని వైనం

మరికల్: పల్లెల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిన వెలుగులు అందించేందుకు ఏర్పాటు చేసిన సౌర దీపాలు నిరుపయోగంగా మారాయి. వాటర్‌షెడ్ పథకం కింద మంజూరైన సోలార్ లైట్లను రెండు కంపెనీలు ఒప్పందం కుదుర్చుకొని గ్రామాల్లో ఏర్పాటు చేశారు. 2016 సంవత్సరంలో జిల్లాలోని 37గ్రామాల్లో 554సోలార్ లైట్లను ఏర్పాటుచేయగా వాటి నిర్వహణ పట్టించుకోకపోవడంతో గ్రామాల్లో ఒక్కటి రెండు మినహా ఎక్కడ వెలగడం లేదు. ఆయా గ్రామాల్లోని ప్రధాన కూడళ్లు, ఆలయాల వద్ద వెళ్లే ప్రధాన రహదారుల పక్కన వీటిని ఏర్పాటుచేశారు. కంపెనీల నిర్లక్ష్యంతో లైట్లు వెలగడం లేదు. ప్రతి సోలార్ దీపం బ్యాటరీ పెట్టె వద్ద కంపెనీ పేరు, వారి ఫోన్‌నంబర్లు పొందుపరిచారు. వాటిని సంప్రదిస్తే ఎలాంటి స్పందన లేదు. జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉందని పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ప్రభుత్వం సైతం లైట్లను మరమ్మతులకు చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**వృథాగా రూ. 83లక్షల నిధులు**

జిల్లాలో 37గ్రామాల్లో 554 సోలార్ లైట్లను వాటర్‌షెడ్ పథకం కింద ఏర్పాటుచేశారు. ఒక్కొక్క లైటుకు రూ. 15వేల ఖర్చు అవ్వగా మొత్తానికి రూ.83,10,000 నిధులు ఖర్చు చేశారు. వీటిని ఏర్పాటు చేసి ఏడేళ్ల గడుస్తున్నా ఎక్కడ కూడా ఒక్కటి రెండు తప్ప మిగిత లైట్లు వెలగడం లేదు. కనీసం మరమ్మతులు చేయడానికి కూడా ప్రజా ప్రతినిధులు, అధికారులు ముందుకు రాకపోవడంతో రూ. 83 లక్షల ప్రభుత్వ ధనం వృథా అయింది.

లైట్లు ఏర్పాటు చేసిన గ్రామాల సంఖ్య

| మండలం | గ్రామాల సంఖ్య | సోలార్ లైట్లు |
|---|---|---|
| మరికల్ | 03 | 40 |
| ధన్వాడ | 03 | 54 |
| మక్తల్ | 03 | 73 |
| మాగనూరు | 04 | 58 |
| ఊట్కూర్ | 04 | 68 |
| నర్వ | 02 | 35 |
| దామరగిద్ద | 06 | 66 |
| కోస్గి | 04 | 60 |
| నారాయణపేట | 04 | 50 |
| మద్దూరు | 04 | 50 |
| మొత్తం | 37 | 554 |

**నిధులు మంజూరు కావాలి..**

జిల్లాలో వాటర్‌షెడ్ పథకంకింద ఏర్పాటు చేసిన సోలార్ లైట్ల మరమ్మతులకు నిధుల కొరత ఉంది. నిధులు మంజూరైన వెంటనే వాటిని మరమ్మతులు చేయించేందుకు చర్యలు తీసుకుంటాం.

– మురళి, డీఎల్‌పీఓ, నారాయణపేట

## పీఆర్టీయూ డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

నారాయణపేట రూరల్: పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం నూతన డైరీని మంగళవారం కలెక్టరేట్ భవనంలో కలెక్టర్ కోయ శ్రీహర్ష విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని, పాఠశాలల్లో భావిభారత పౌరులను తీర్చిదిద్దుతున్న గురువులకు కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సమయపాలన పాటించి, టీఎల్ఎం ఉపయోగించి చక్కటి విద్యాబోధన చేయాలని, విద్యార్థుల సంఖ్యను పెంచుతూ టెన్త్‌లో చక్కటి జీపీఏతో వందశాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలోనే జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి యాదిరెడ్డి జనార్ధన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, రఘువీర్, శ్రీనివాస్, సత్యనారాయణరెడ్డి, భాస్కర్, నరేందర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## శబరిమలకు బయలుదేరిన స్వాములు



శబరిమలకు బయలుదేరి వెళ్తున్న స్వాములు

మద్దూరు: నియమనిష్టలతో 41రోజులపాటు అయ్యప్ప మాలధారణ చేసిన భక్తులు మంగళవారం శబరిమలకు బయలుదేరి వెళ్లారు. మండలంలోని నిడ్జింత గ్రామ శివారులోని దేవరగట్టుపైన ఉన్న తిరుమలేశుడి ఆలయంలో మహేష్‌గురుస్వామి శబరిమల వెళ్లే స్వాములకు ఇరుముడులు కట్టారు. నిడ్జింత గ్రామానికి చెందిన తిరుపతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీను, వీరారం సర్పంచ్ తిరుపతి, పల్లెగడ్డకు చెందిన శ్రీనివాస్, వేణులో ఇరుముడులతో శబరిమలకు బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో అయ్యప్పమాలధారులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## దరఖాస్తుల కంప్యూటరీకరణ వేగవంతం



మక్తల్‌లో దరఖాస్తుల పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్



మాగనూర్‌లో..

మక్తల్: ప్రభుత్వం ఆరుగ్యారంటీలు అమలులో భాగంగా చేపడుతున్న ప్రజాపాలన దరఖాస్తుల కంప్యూటీకరణ వేగవంతంగా కొనసాగుతుందని మున్సిపల్ కమిషనర్ బాల్‌రాంనాయక్ తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని 16వార్డుల్లో 7037 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. దరఖాస్తుల కంప్యూటీకరణ వేగవంతంగా కొనసాగుతుందని తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటుచేసి ప్రజాపాలన దరఖాస్తుల కంప్యూటీకరణను చేపడుతున్నామన్నారు. దరఖాస్తుల్లో పొందుపరిచిన అంశాలన్నింటిని ఆన్‌లైన్‌లో తప్పులు లేకుండా పొందుపరుస్తున్నామని మీసేవా నిర్వాహకుల సాయం తీసుకుంటున్నామన్నారు.

మాగనూర్: ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 6న ముగియడంతో మండల ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు వచ్చిన దర ఖాస్తులను ఆన్‌లైన్ ఎంట్రీ కార్యక్రమంలో నిమగ్నమయ్యారు. కలెక్టర్ ఆదేశాలతో డాటా ఎంట్రీ పనులను ఎంపీడీఓ శశికళ పరిశీలించారు. ప్రతి ఒక్క దరఖాస్తును ఎటువంటి తప్పులు లేకుండా నమోదుచేయాలని సిబ్బందికి సూచించారు.


## వ్యాధి నిరోధక టీకాలతో సంపూర్ణ ఆరోగ్యం



విద్యార్థినికి టీకా వేస్తున్న సిబ్బంది

అమరచింత: ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో చదువుకుంటున్న పది, ఐదో తరగతి విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ కోసం టీడీ టీకాలు వేస్తున్నామని తిప్పుడంపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శరత్ తెలిపారు. మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థినులకు మంగళవారం టీడీ వ్యాక్సిన్లు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ నిఖిత, హెల్త్ సూపర్‌వైజర్ సురేందర్‌గౌడ్, హెడ్ మాస్టర్ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోండి



కమిషనర్‌కు ఫిర్యాదు అందిస్తున్న అరుణ్‌కుమార్

అమరచింత: పట్టణంలోని సర్వేనంబర్ 10/2, 34, 35లో గల సుమారు రెండు ఎకరాల స్థలాన్ని లేఅవుట్‌గా మార్చి డీటీసీపీ అనుమతి లేకుండా ప్లాట్లు విక్రయిస్తున్నారని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్‌ఖాజాకు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అరుణ్ ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా అరుణ్ మాట్లాడుతూ 2019లో అమరచింత పట్టణం మున్సిపాలిటీగా రూపాంతరం చెందిందని, కానీ గ్రామ పంచాయతీ ద్వారా నాలా పర్మిషన్ పొందినట్లు నకిలీ పత్రాలు సృష్టించారన్నారు. ఈనెల 5వ తేదీన శాంత అనే మహిళ కిరణ్‌కుమార్‌కు ఈ లేఅవుట్‌లో గల 44 ప్లాట్లను జీపీ ప్రకారం రిజిస్ట్రేషన్ చేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. విచారణ జరిపి అనుమతి లేని వెంచర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## నేడు ఎమ్మెల్యే పర్యటన

నారాయణపేట: ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి బుధవారం ఉదయం 9:గంటలకు దామరగిద్ద మండలంలోని ఎల్సన్‌పల్లి పంచాయతీ భవనానికి శంకుస్థాపన చేయనున్నారు. 10.30 గంటలకు సత్యనారాయణ స్వామి ఆలయం వద్ద జిల్లా గ్రామీణ వైద్యసేవకుల సంఘం వారి క్యాలెండర్, 11:గంటలకు మండల సమావేశం. 2.30 గంటలకు ఆర్డీఓ కార్యాలయంలో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ, 4:గంటలకు ధన్వాడ రైతువేదికలో కల్యాణ లక్ష్మిచెక్కుల పంపిణీ, సాయంత్రం 6 గంటలకు సీవీఆర్ భవన్‌లో భాషా పండితుల క్యాలెండర్ ఆవిష్కరణ ఉంటుందన్నారు.

## నేడు ఆరాధన ఉత్సవాలు

నారాయణపేట రూరల్: పట్టణంలోని పళ్ల శ్రీ రాఘవేంద్రస్వామి ఆలయంలో బుధవారం జితా మిత్రరాయుల ఆరాధన ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు జయతీర్థ, రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, భజన, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ప్రవచనం ఉంటాయన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలన్నారు.


## బాధితుడికి పరామర్శ

మరికల్: కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బి. వీరన్న అనారోగ్యంతో మహబూబ్‌నగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా మంగళవారం పార్టీ మాజీ జిల్లా అధ్యక్షుడు శివకుమార్‌రెడ్డి పరామర్శించారు. ఆయన అనారోగ్యంతో పదిరోజుల నుంచి ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అనారోగ్యం కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పరంగా తమ సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సూర్యమోహన్, రామకృష్ణారెడ్డి, సత్యన్న, రఘు, గోవర్ధన్ పాల్గొన్నారు.

## నేడు మండల సర్వసభ్య సమావేశం

నారాయణపేట రూరల్: మండల సర్వసభ్య సమావేశాన్ని బుధవారం ఉదయం 10గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ అమ్మకోళ్ల శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతున్నట్లు చెప్పారు. సమావేశానికి మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, మండలస్థాయి అన్నిశాఖల అధికారులు విధిగా హాజరు కావాలన్నారు.

## తెలుగు సాహిత్యంపై పట్టు అవసరం



అమరచింత: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలకు డీఎంఆర్ఎం ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం 350 తెలుగు సాహిత్య పుస్తకాలను పంపిణీ చేసినట్లు రెడ్‌క్రాస్ జిల్లా సభ్యుడు శ్యాం తెలిపారు. డీఎంఆర్ఎం ట్రస్ట్ చైర్మన్, మాజీ అడ్వకేట్ జనరల్ దేశాయి ప్రకాష్‌రెడ్డి ఆదేశాలతో విద్యార్థులకు ఉపయోగపడే విధంగా తెలుగు సాహిత్య పుస్తకాలను అందుబాటులో ఉంచుతున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కరుణాకర్, బాలస్వామి, బలరాముడు తదితరులు పాల్గొన్నారు.

## వేపచెట్టు కొమ్మల తొలగింపు



అమరచింత: పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఉన్న పురాతన వేప చెట్టు కొమ్మలు విరిగి పడుతున్నాయని హెచ్ఎం బలరాముడు అధికారులకు వివరించారు. ఆయన వినతి మేరకు కొమ్మలను తొలగించారు. ఆదివారం చెట్టు కొమ్మలు విరిగి పడిన విషయాన్ని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్‌ఖాజాకు హెచ్ఎం తెలియజేశారు. దీంతో మంగళవారం చెట్టుకు బలహీనంగా ఉన్న కొమ్మలను పూర్తిస్థాయిలో తొలగించినట్లు కమిషనర్ తెలిపారు.

## బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలి



మాట్లాడుతున్న ఏఎంఓ విద్యాసాగర్

మాగనూర్: బడి బయటి పిల్లలను బడిలో చేర్పించాలని ఏఎంఓ విద్యాసాగర్ అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని నేరడగం ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ.. బడిబయట ఉన్న పిల్లల వివరాలు తెలుసుకొని, వారిని బడిలో చేర్పించాలని తల్లిదండ్రులకు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో నిష్ణాతులైన శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఉంటారని, తమ పిల్లలను ప్రభుత్వల్లోనే బడుల్లో చేర్పించి, వారి అభ్యున్నతికి పాటుపడాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రాములు, ఐఆర్పీ తిరుపతి, సీఆర్పీ ఎల్లాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రోనిపల్లి చెరువు పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..



చెరువును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

ధన్వాడ: మంగళవారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురించబడ్డ చెరువు కబ్జాను అడ్డుకోండి అనే శీర్షికపై అధికారులు స్పందించారు. మంగళవారం అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్ (రెవెన్యూ) ఇరిగేషన్ అధికారులతో కలిసి మండలంలోని మంత్రోనిపల్లి చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో కలిసి పూర్తిస్థాయి నివేదికను తయారుచేసి తనకు అందజేయాలని సూచించారు. సర్వే చేయిస్తామని రెవెన్యూ అధికారులు తెలిపారు. తహసీల్దార్ సింధుజా, ఇరిగేషన్ ఈఈ బ్రహ్మానంద, డీఈ కిరణ్‌కుమార్, ఏఈ సదనంద్‌లు ఉన్నారు.

## ఇంటింటికీ రాముడి అక్షతలు



అక్షతలను ఊరేగిస్తున్న గ్రామస్తులు

మరికల్: అయోధ్య నుంచి వచ్చిన అక్షతలను మండలంలోపి అప్పంపల్లిలో మంగళవారం విశ్వహిందూ, భజరంగదళ్, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఇంటింటికీ పంపిణీ చేశారు. వార్డుల వారిగా టీములను ఎంపికచేసి ఇంటింటికీ అక్షతలను చేరేలా చర్యలు తీసుకున్నారు. అంతకుముందు అయోధ్య అక్షతలను ఊరేగింపుగా తీసుకెళ్లి ఇంటి సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో విశ్వహిందు, భజరంగదళ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## షీటీమ్స్‌పై అవగాహన కలిగి ఉండాలి



స్కూల్‌లో మాట్లాడుతున్న ఏఎస్ఐ శ్రీదేవి

నారాయణపేట రూరల్: మహిళలు అత్యవసర సమయంలో తమ రక్షణకు షీటీమ్స్ ఉంటాయనే విషయంపై అవగాహన కల్గిఉండాలని ఏఎస్ఐ శ్రీదేవి అన్నారు. మంగళవారం పట్టణంలోని మార్కెట్‌లేన్ స్కూల్ విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు, బాలికలతో ఎవరైన ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, ప్రేమ పేరుతో వేదింపులకు పాల్పడితే వెంటనే డయల్ 100, మహిళా హెల్ప్‌లైన్ నంబర్8712670398కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్ నేరాలను అరికట్టడానికి సెల్‌ఫోన్ వినియోగం తగ్గించాలని, అమ్మాయిలకు గుడ్, బ్యాడ్‌టచ్ గురించి తెలిసి ఉండాలన్నారు. అమ్మాయిలతోపాటు మగపిల్లల్లోను మార్పు రావాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో ప్రిన్సిపాల్, టీచర్లు, షీటీం సభ్యులు బాలరాజు, నమీనా, లాయక్ తదితరులు పాల్గొన్నారు.

## తపస్ క్యాలెండర్ ఆవిష్కరణ



నర్వలో క్యాలెండర్ ఆవిష్కరణలో పాల్గొన్న నాయకులు

దామరగిద్ద: తపస్ నూతన క్యాలండర్‌ను మంగళవారం మండల వనరుల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ మేరకు.. తపస్ మండల అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాస్‌చారి, రాజశేఖర్ మాట్లాడుతూ తపస్ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ముందంజలో ఉంటుందన్నారు. అంతకుముందు క్యాలెండర్‌ను విడుదలచేశారు. కార్యక్రమంలో తపస్ సంఘం సభ్యులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నర్వ: ఉపాధ్యాయుల సమస్యలపై తపస్ అలుపెరగని పోరాటం చేస్తుందని తపస్ జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం మండలంలోని ఉన్నత పాఠశాలలో క్యాలెండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు.. ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలపై సంఘం పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్ష కార్యదర్శులు వెంకటేష్, రాజు, కాంప్లెక్స్ హెచ్ఎం రాజేష్, ఉపాధ్యాయులు శ్రీధర్, శ్రీనివాసులు, తిరుపతిరెడ్డి, గోవిందు పాల్గొన్నారు.

## ప్రసవాల సంఖ్య పెంచాలి



సమావేశంలో పాల్గొన్న వైద్య సిబ్బంది

నర్వ: పీహెచ్‌సీలో ప్రసవాల సంఖ్యను పెంచేందుకు కృషిచేయాలని ప్రోగ్రాం అధికారి రాఘవేందర్ అన్నారు. మంగళవారం మండలంలోని పీహెచ్‌సీలో ఆశాలు, ఏఎన్ఎంలు, ఇతర వైద్యసిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌సీడీ ప్రోగ్రాంను వేగవంతం చేయాలన్నారు. గ్రామాల్లో ఎన్‌సీడీ సర్వే ఎప్పటికప్పుడు పూర్తిచేసేందుకు అందరు కృషిచేయాలన్నారు. పీహెచ్‌సీలో ఓపీసేవలను సక్రమంగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందించే ఇతర వైద్యసేవలను కొనసాగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యురాలు డా.కృష్ణప్రియ, సీహెచ్ఓ ప్రభాకర్ జెట్టి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.